క్లుప్తంగా

షేక్ సుభానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు



క్రోసూరు: క్రోసూరుకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ సుభానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ఏపీఎంపీఏ (ఏపీ ఎంఈడీస్ ప్రాస్పరిటీస్ అసోసియేషన్)అందజేసినట్లు ఆదివారం తెలిపారు. శనివారం విజయవాడలోని సిద్ధార్థ బీఈడీ కాలేజీలో జరిగిన సన్మాన కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సుభానికి క్రోసూరులోని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందించారు.

అన్నార్తులకు భోజనం ప్యాకెట్లు



సత్తెనపల్లి: అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో రైల్వేస్టేషన్, తాలూకా సెంటర్‌లోని అన్నార్తులకు షేక్ ఖాజా, మున్నా దంపతుల ఆర్థిక సాయంతో ఆదివారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ పిల్లుట్ల ఆంజనేయులు, సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు పిక్కిలి రత్తయ్య, మల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడే జగద్గురువు



క్రోసూరు: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ఆదివారం 'త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ -చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో క్రోసూరులో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం ఇంటింటా నిర్వహించారు. శ్రీకృష్ణుడే జగద్గురువు అని అందరూ తెలుసుకోవాలని సభ్యులు తెలిపారు. కృష్ణ భగవానుడి ఊరేగింపు ఊరూరా చేయాలన్నారు. దేవుడే మానవరూపంలో శ్రీకృష్ణుడిగా అవతరించాడని, ఆయన్ను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలని ఊరేగించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- పిడుగురాళ్ల కమిటీ, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కోరిన విధంగా పరిహారం చెల్లించాలి



చిలకలూరిపేట: చిన్న, సన్నకారు రైతులు కోరిన విధంగా న్యాయబద్ధమైన పరిహారం చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. వాడరేవు- పిడుగురాళ్ల రహదారి అభివృద్ధిలో భూములు కోల్పోయిన రైతులు న్యాయమైన పరిహారం చెల్లించాలంటూ బొప్పూడి వద్ద నిరసన దీక్షకు దిగారు. ఆదివారం రైతులకు సంఘీభావంగా పాల్గొన్న భానుప్రసాద్ మాట్లాడుతూ బొప్పూడి, పసుమర్రు రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించేవరకు పోరాడుతామన్న రైతుల గోడును రహదారుల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ నిర్లక్ష్యం వీడి రైతుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలన్నారు. అలా చేయని పక్షంలో రైతులు చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పక్షాలతో కలసి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బొప్పూడి రైతులు పాల్గొన్నారు.

మాలల రణభేరిని జయప్రదం చేయండి

వినుకొండ: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో నవంబరు 2వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మతోటి పోలు కోరారు. వినుకొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇటీవల జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, మహానాడు తెలంగాణ అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రణభేరి సభపై చర్చించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు నిర్వహిస్తున్న రణభేరి లో మాలలందరూ పాల్గొనాలన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. హైస్కూల్ విద్యార్థులకు హిందీ పరీక్షల్లో ప్రత్యేక పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, హిందీ ఉపాధ్యాయురాలు ఎ.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉన్నా.. ఉపయోగం సున్నా



రాజుపాలెంలో షాపింగ్ కాంప్లెక్స్



చాటపాపాయపాలెంలో నిరుపయోగంగా దుకాణాలు

- నిరుపయోగంగా ఆర్‌ఆర్ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌లు
- ఎప్పుడూ మూతే
- అసాంఘిక శక్తులకు నెలవు

రాజుపాలెం: మండల పరిధిలో ఏర్పాటుచేసిన షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నా లేనట్లే. ఇవి ఆదాయ వనరుగా మారతాయని నాడు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఎప్పుడూ మూత వేసి కనిపిస్తున్నాయి. వీటితో వచ్చే ఆదాయంతో కాంప్లెక్స్‌ల అభివృద్ధి, కాలనీలకు వసతులు అమరుతాయనుకుంటే లక్ష్యం నీరుగారింది. పైగా ఇవి అసాంఘిక శక్తులకు నెలవుగా మారుతున్నాయి.

పంచాయతీలకు అప్పగించలేదు

పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసే సమయంలో 2011లో రాజుపాలెం, చౌటపాపాయపాలెం, రెడ్డిగూడెంలో షాపింగ్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో 6,7,5 మొత్తం 18 దుకాణాలున్నాయి. ఈ సముదాయాలను ఇప్పటి వరకు పంచాయతీలకు అప్పగించలేదు. వీటి నిర్వహణను పట్టించుకునే వారే లేకుండాపోయారు. పంచాయతీలకు అప్పగిస్తే టెండర్లను పిలిచి దుకాణాలను అద్దెకిచ్చేవారు. పూర్తిస్థాయిలో ఆదాయం వచ్చేది.

వారికి వినియోగించాలి

మండలం పరిధిలోని రాజుపాలెం, చౌటపాపాయపాలెం, రెడ్డిగూడెంలో పులిచింతల నిర్వాసిత కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇక్కడ బోధనం, కేతవరం, చిట్యాలతండా, కొల్లూరు, గొల్లపేట, పులిచింతల, గోపాలపురం గ్రామాల ప్రజలు తరలి వచ్చి నివసిస్తున్నారు. వీరి కోసం పులిచింతల నిర్వాసిత కార్యాలయం గుంటూరులో ఉండేది. నిర్వాసిత ప్రాంతాల్లోని ప్రజల ఉమ్మడి ప్రయోజనం కోసం సదరు దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని వినియోగించాలి. ఇదే క్రమంలో ఒప్పందం మేరకు రాజుపాలెంలో ఒక కమిటీకి షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, అద్దెల వసూలు తదితర బాధ్యతలను అప్పగించారు. ఆ కమిటీ పెద్ద.. కొన్నిషాపుల ద్వారా వస్తున్న అద్దెను వసూలు చేసి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించడం గానీ, దుకాణ సముదాయాల నిర్వహణగానీ చేయడం లేదు. కనీసం లెక్కలు కూడా కమిటీ వారికి తెలియనివ్వడం లేదని తెలుస్తోంది.

పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు

ఈ ప్రాంతాల్లో దుకాణ సముదాయాల వద్ద అసాంఘిక శక్తులు అధికమవుతున్నాయి. ఈ షాపుల వద్ద మందుబాబులు చేరి పూటుగా తాగి హడావుడి చేస్తున్నారు. కొందరు పేకాటరాయుళ్లు కూడా ఇక్కడకు చేరుతున్నారు.

స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా..

గతంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కాంప్లెక్స్‌లను పరిశీలించి అక్కడ జరుగుతున్న పరిణామాలను తెలుసుకున్నారు. అయినా ఫలితం లేదు. కేవలం రాజకీయ అండదండలతోనే షాపింగ్ కాంప్లెక్స్‌కు వచ్చే ఆదాయం దుర్వినియోగం చేస్తున్నారని, నిర్వహణ కూడా చేయడం లేదని నిర్వాసితుల కాలనీ వాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌లను వినియోగంలోకి తేవాలని నిర్వాసిత కాలనీల ప్రజలు కోరుతున్నారు.

నిషేధిత జాబితా 22ఏ లో ఉన్న భూములను ప్రకటించాలి

న్యాయవాది నరిశేటి వేణుగోపాల్



సత్తెనపల్లి: నియోజకవర్గంలోని నిషేధితజాబితా 22-ఏ లో ఉన్న భూముల జాబితా ప్రకటించాలని న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు మండలాల రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖ కార్యాల యాల పరిధిలోని నిషేధిత జాబితా 22-ఏలో ఉన్న భూముల జాబితా తక్షణమే బహిరంగ ప్రకటనలో ప్రజలకు వెల్లడించాలన్నారు. పల్నాడు కలెక్టర్, సత్తెనపల్లి ఆర్డీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇబ్బందులే

నియోజకవర్గంలోని అటవి, దేవదాయ, వక్ఫ్, ప్రభుత్వ బంజరు, వాగులు, కుంటలు, చెరువు పోరంబోకు భూముల జాబితా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఒక సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉంటే ఆ సర్వే నంబర్ అంతా 22-ఏ కింద రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డులలో చూపడంతో అదే సర్వే నంబర్‌లో ప్రైవేటు భూముల యజమానులు క్రయ, విక్రయాలు జరపడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాస్తవ పరిస్థితులు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారు లకు తెలిసినా 22-ఏ జాబితా సరిచేసే ప్రయత్నం చేయడం లేదన్నారు. ఇది సాకుగా చూపించి రెవిన్యూ రికార్డుల మార్పు, రిజిస్ట్రేషన్ కోరకు భూయజమానులు నుంచి అధిక మొత్తంలో డిమాండ్‌చేసి ఇచ్చినవారి పనులు చేసి మిగితా వారివి హోల్డ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని 22-ఏ భూముల జాబితా ప్రకటించి, ఒరిజినల్‌గా 22-ఏ భూములు గుర్తించి సంబంధింత శాఖలు ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసువాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు తప్పుడు సమాచారంతో దొంగ రిజిస్ట్రేషన్‌లు జరిగి ఉంటే ఆ భూములను స్వాధీనం చేసుకొని ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

క్రోసూరు: మండల వ్యాప్తంగా ఉచిత గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమం సోమవారం నుంచి సెప్టెంబర్ 15 వరకు పశువైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దకే వచ్చి టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యులు బషీర్ ఆదివారం తెలిపారు. గాలి కుంటు వ్యాధి టీకాల యాక్షన్ ప్లాన్ వివరిస్తూ ఈనెల 19 వరకు 88తాళ్లురు, ఉయ్యందన, అనంతవరం గ్రామాలు 20న గరికపాడు గ్రామం, 21 నుంచి 25 వరకు గుడి పాడు, పీసపాడు, పారుపల్లిలో టీకాలు వేస్తారు. 26 నుంచి 30 వరకు అందుకురు, బాలెముర్రు , హసనబాద్, నాగావరం గ్రామాల్లో, సెప్టెంబర్ 1 వ తేదీ నుండి 6 వ తేదీ వరకు ఊటుకూరు, విప్పర్ల, దొడ్లేరు గ్రామాల్లో టీకాలు వేస్తారు, 7వ తేదీ నుంచి 10 వరకు ఆవులవారిపాలెం, పెరికాపాడుతండా, బయ్యావరం గ్రామాల్లో, 11 నుంచి 15 వరకు క్రోసూరు లలో నిర్వహిస్తారని తెలిపారు. మండలంలో 21వ పశుగణన సర్వేలో 1,892 తెల్ల పశువులు, 10,532 గేదెలు నమోదు చేసినట్లు తెలిపారు.

భారీ వర్షం

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండో రోజు సత్తెనపల్లిలో వర్షం దంచి కొట్టింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రానున్న మూడు రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. పత్తి పొలాల్లో తేమ ఎక్కువగా ఉండి కలుపు పెరిగిపోయే అవకాశం ఉంది.

దాసునాయన మఠంలో వేదాంత ప్రవచనాలు

నాదెండ్ల: జాతీయ రహదారి పక్కనే గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ ఆంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో ఆదివారం మఠాధిపతుల ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమానికి మఠం పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, చుండూరుకు చెందిన తురియానంద, తాడేపల్లికి చెందిన నిరంజన్‌దాస్, రాజమండ్రికి చెందిన గీతాస్వామి, సత్తెనపల్లికి చెందిన ఫిరోదుపీఠం వెంకటరావు, తెనాలికి చెందిన చిట్టిబాబు ప్రసంగాలు నిర్వహించారు. ప్రవచనాలు, భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం, వేద విజ్ఞానం, ఆత్మజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులగుట అనే అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయమ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రేపు మెడికల్ క్యాంపు

నాదెండ్ల: నాదెండ్ల గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వర ఆలయం కల్యాణ మండపంలో నరసరావుపేట శ్రీయ హాస్పిటల్స్ అండ్ ఐవీఎఫ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మేనేజర్ రామకృష్ణారెడ్డి, పీఆర్‌ఓ ఖాదర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే క్యాంప్‌లో ఉచిత సంతాన సాఫల్య చికిత్స క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా సంతానం లేని దంపతులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని తిరిగి పిల్లల కోసం ప్రయత్నించే వారు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22 నుంచి దసరా వేడుకలు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో 24వ దసరా శరన్నవరాత్రి వేడుకలు ఈనెల 22 నుంచి ప్రారంభమై అక్టోబరు 2న ముగుస్తాయని దేవస్థాన కమిటీ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి వేడుకలు ప్రతి ఏటా గ్రామస్తులు, దాతల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. నవరాత్రులు వేడుకలు పురస్కరించుకొని 22న తేదీన మొదట రోజు బాల త్రిపురసుందరిదేవి, 23న శ్రీగాయత్రి దేవి, 24న శ్రీఅన్నపూర్ణ దేవి, 25న కాత్యాయని దేవి, 26న శ్రీమహాలక్ష్మిదేవి, 27న శ్రీలలితా త్రిపురసుందరి దేవి, 28న శ్రీమహాచండీదేవి, 29న శ్రీసరస్వతీ దేవి, 30న శ్రీదుర్గాదేవి, 1న శ్రీమహిషాసురమర్దని చివరిరోజు 2న శ్రీ రాజరాజేశ్వరి అలంకరణతో భక్తులకు అమ్మవారు దర్శనం ఇస్తుందన్నారు. రావిపాటి సాయి భరత్ ఆధ్వర్యాన పూజ కార్యక్రమాలు దసరా వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయాన్నే ఉభయ దాతలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉభయ దాతలు వితరణ చేసిన తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు దేవాలయం ప్రాంగణంలో భక్తబృందంతో భజన కార్యక్రమాలు మేళతాళాల నడుమ వైభవంగా జరుగుతాయన్నారు. అనంతరం మహిళా భక్తులకు దాతలు అందజేసిన ప్రోత్సాహక బహుమతులను లాటరీ విధానం ద్వారా అందజేస్తామన్నారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేస్తామన్నారు. భక్తులందరు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా



ట్రోఫీతో బాలికలు

శావల్యాపురం: రాష్ట్రస్థాయి అండర్-19 జూనియర్ బాల బాలికల బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు బాలికలు సత్తా చాటినట్లు పాఠశాల హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14 వరకు సత్యసాయి జిల్లా రామపురంలో పోటీలు జరగ్గా బాలికల విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు విన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆకుమళ్ళ సమీరా, కామినేడి కావ్యలు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు అందుకున్నారన్నారు. అక్టోబరు నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఇరువురు బాలికలు పాల్గొంటారన్నారు. అభినందించిన వారిలో పాఠశాల ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంటు ఇ.శివశంకరు, పీడీలు రాగుల రాధా కృష్ణమూర్తి, బి.ఝాన్సీ, కోచ్ జోనానాయక్, మేనేజరు గోపిలు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో దేశభక్తి, సేవాభావం



నరసరావుపేట రూరల్: స్కౌట్ అండ్ గైడ్స్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు దేశభక్తి, సేవా భావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.పార్వతి తెలిపారు. పాఠశాలలో రెండు రోజుల పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాలకు చెందిన 80మంది స్కౌట్ విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో హెచ్‌ఎం పార్వతి పాల్గొని మాట్లాడారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్కౌట్ విద్యార్థులు తమ వంతు సేవలు అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో సేవాభావాన్ని పెంపొందించేలా స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేర్పించాలని సూచించారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మామిళ్ల కృష్ణయ్య, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ బద్దిగం శివనాగిరెడ్డి, స్కౌట్స్ జిల్లా మానవ వనరుల కమిషనర్ పమ్మి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ, తార్కిక దృక్పథంతో బోధన



వినుకొండ: విద్యార్థి దశ నుంచే చారిత్రక, భౌగోళిక, పరిపాలన అంశాలు శాస్త్రీయ, తార్కిక పద్ధతుల్లోనే బోధించాలని ఎయిమ్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ సూచించారు. వినుకొండ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ భూగోళం పుట్టుక, చరిత్ర గమనం, మానవుడి పరిణామ క్రమంలో వచ్చిన మార్పులు భావితరాలకు తెలియాలంటే విద్యావ్యవస్థలో మార్పులు అనివార్యమని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు పి.జె.లూకా, మూర్తి, కౌన్సిలర్ షకీలా, విద్యావంతుల వేదిక సభ్యులు విజయ్‌కుమార్, పిడుగు విజయ్, ఎం.ఎ.సాలార్, తెల్లమేకల శ్రీనివాసరావు, బాషా, మస్తాన్‌వలి, వహిదా, రామాచారి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌బాబుకు న్యాయం చేయాలి

పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్‌మస్తాన్‌వలి



చేజర్లలో రిలే దీక్షలో సాగర్‌బాబుకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

నకరికల్లు: విద్యుత్ ప్రమాదానికి గురైన సాగర్‌బాబుకు న్యాయం చేయాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదానికి గురైన పట్టించుకోవడంలేదంటూ మండలంలోని చేజర్లలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. సాగర్‌బాబుకు మద్దతు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు ఆదివారం మాట్లాడుతూ కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామానికి చెందిన వర్ల సాగర్‌బాబు కరెంటు మీటర్ల రీడింగ్ చేస్తూ ఉపాధి పొందుతుంటాడన్నారు. గ్రామంలో రథోత్సవం జరిగే క్రమంలో లైన్‌మెన్ ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మాచార్యులు ఆదేశాల మేరకు విద్యుత్‌స్తంభాలు ఎక్కి కరెంట్ తీగలు కట్ చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో లైన్‌మెన్‌లు ఎల్‌సీ తీసుకొని విద్యుత్ సరఫరా ఆపకపోవడంతో సాగర్‌బాబు తీవ్ర కరెంట్ షాక్‌కు గురయ్యాడన్నారు. ప్రమాదంలో వెన్నెముక విరిగి పూర్తి వికలాంగుడిగా మారి మంచాన పడ్డాడన్నారు. అధికారులు ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా కప్పిపుచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం లాంటివి అందక కుటుంబం కష్టాల్లో ఇరుక్కుపోవడంతో చేజర్లలోని అత్తవారింట్లో కాలం వెళ్లదీస్తున్నాడన్నారు. కనీసం పూటగడవక పట్టించుకునే వారు లేక అల్లాడిపోతున్నారని వెంటనే వర్ల సాగర్‌బాబు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నేత వై.వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకుడు జి.పిచ్చారావు, సాగర్‌బాబు తల్లి వీరమ్మ, భార్య కెజియా, పలువురు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అవసరం మేరకు యూరియా కొనుగోలు చేయండి



మన గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: మండలంలోని 3 రైతు సేవా కేంద్రాల ద్వారా 59.04 మెట్రిక్ టన్నులు(1320 బస్తాలు) యూరియా ఆదివారం రైతులకు పంపిణీ చేసినట్లు సత్తెనపల్లి మండలం వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి తెలిపారు. సత్తెనపల్లి మండలం భీమవరం, కట్టమూరు, బట్లూరు రైతు సేవా కేంద్రాలకు ఒక్కొక్క దానికి 19.8 మెట్రిక్ టన్నుల (440 బస్తాలు) చొప్పున మొత్తం 59.04 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందన్నారు. ఒక్కొక్క రైతుకి 2 యూరియా కట్టల చొప్పున పంపిణీ చేశామన్నారు. రైతుల అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని, దొరకదేమోనని రైతులు ఆందోళన చెంది అధిక నిల్వలు చేసుకోకూడదన్నారు. రైతులందరికీ పీఏసీఎస్, రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. నానో యూరియా పైపాటుగా పిచికారి చేసుకుంటే పంటకు కావలసిన నత్రజని అందుతుందని, వాతావరణం, నీటికాలుష్యం తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని మన గ్రోమోర్ కేంద్రంలో ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు.ఆయనతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

సీపీఎం కార్యాలయానికి ఇన్వర్టర్ బహూకరణ



పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇన్వర్టర్‌ను అందజేస్తున్న గంజి వీరాస్వామి

సత్తెనపల్లి: పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలోని సీపీఎం కార్యాలయానికి పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త గంజి వీరాస్వామి ఆదివారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులైన గంజి రాములు, అంజమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు వీరాస్వామి, అంజయ్య, శ్రీనివాసరావు ఈ ఇన్వర్టర్ ను బహూకరించినట్లు ఆయన తెలిపారు. దీన్ని సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమలకు అందజేశారు. సీనియర్ న్యాయవాది పిన్ననేని పాములయ్య అధ్యక్షత వహించిన సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ రాములు పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలు

మాచర్ల రూరల్: ఇంజినీరింగ్ డే ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య యువ ఇంజినీర్లకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. 30 దేశాల ఇంజినీర్లకు మార్గదర్శిగా నిలిచిన విశ్వేశ్వరయ్య దేశ ప్రతిష్టకు చెందిన అనేక ప్రాజెక్టులను నిర్మించటమే కాకుండా అనేక సంస్థలకు రూపకల్పన చేసిన గొప్ప సాంకేతిక నిపుణులని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రముఖ సివిల్ ఇంజినీర్ కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, రాజబోయిన మధుయాదవ్, గుండాల శ్రీను యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బకాయిలు రూ. 20వేల కోట్లు విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు సమయానుకూలంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించటంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం, వేతనాలు మంజూరు చేయటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఉద్యోగులు, ఉపాధ్యాయులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఇతర పనులు అప్పగించరాదన్నారు. నారా లోకేష్ మంత్రిగా ఉన్న విద్యాశాఖలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించటంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రామ రెవెన్యూ సంఘం నాయకులు



మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కృతికా శుక్లాను పల్నాడు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ రఘునాథబాబు, ఉపాధ్యక్షులు షేక్ ఖాజావలి, సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు వి.వెంకటరామిరెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు, మాబు వలి ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com